**మనసిచ్చిన మగువ ఎంతటి దుఃఖమైనా సహిస్తుంది. ఎడబాటు భరిస్తుంది. ఎన్ని కష్టాలనయినా చిరునవ్వుతో ఎదుర్కొంటుంది జంకదు. భీతి చెందదు. ఆశ విడవదు కాని ఎవరిని నమ్ముకొని, ఎవరికి సర్వస్వమూ అర్పించుకొంటుందో వారి తిరస్కారం మాత్రం సూచనప్రాయంగా అయినా భరించదు. భరించి తనువు నిలుపుకోలేదు.**

దేనినీ లెక్కచేయకుండా క్రూరంగా దూకుడుగా వీచే హోరు గాలికి నిలవలేక బాధతో తలలు వంచుతున్నాయి చెట్లు. జల్లు జల్లుగా కురుస్తూంది వాన సర్వాన్నీ తన రెక్కలు కప్పి ఆవరించుకున్న కారుచీకటిని చీలుస్తూ ఉండి ఉండి మెరుస్తున్నాయి మెరుపులు ఆ మెరుపుల్లో కనిపించే మిద్దె కొంపలో భయంగా బిక్కు బిక్కుమంటూ వెలిగే లాంతరు కింద మంచంలో అప్పుడే పుట్టిన బిడ్డ చేస్తున్న రోదన హోరుగాలిలో కలిసిపోతూంది.

తన రక్త మాంసాలు పంచుకున్న బిడ్డపై ఆఖరుసారిగా తను చెయ్యబోయే హత్యా ప్రయత్నం గురించి ఆలోచిస్తున్న తల్లి బిడ్డ ముఖాన్ని దీపం వెలుగులో పరీక్షగా చూసింది. చూసి, తన శరీరంలో ప్రతి అణువునా ప్రవహించే వాత్సల్యంతో, ఏడ్చే బిడ్డను గాఢంగా హృదయానికి హత్తుకుంది. ఆమెకు ఒక్కసారిగా తన శరీరం, ప్రాణం వెచ్చించి బిడ్డను పెంచి పెద్ద చెయ్యాలనిపించింది.

పెల్లుబికి వచ్చే దుఃఖాన్ని దిగమింగటానికి ప్రయత్నిస్తూ, తల్లి మంచం పక్కన, కింద కూర్చున్న స్త్రీతో, "అక్కా... ఈ బిడ్డ...బిడ్డనీ ఆ తాగుబోతు తండ్రి ఎట్లానూ పెంచేది లేదు. నా బతుకు ఇట్లా ఉంది. నాకు బతకాలని లేదు. గాలికి వదిలి దీని బతుకు బండలు చెయ్యడం ఏల? నా బిడ్డను దూరంగా తీసుకుపోయి పీక నులిమెయ్యి, అక్కా" అని బావురుమంది.

ఆమె అక్కకు కూడా దుఃఖం పొంగి వచ్చింది. ముక్కుపచ్చలారని అమాయకపు పసిబిడ్డను ప్రేమగా చూసి, ఒడ్డపై వెయ్యవేసి వాత్సల్యంతో సున్నితంగా నిమిరింది. ఆమె మనస్సు చెల్లెలు చెప్పిన మాటల్ని ఖండఖండాలుగా చీల్చింది.

తల్లి వెక్కి వెక్కి ఏడ్చి, నరాలూ ఊపిరితిత్తులూ అలిసిపోయి నిద్ర పోయింది. మళ్లీ నిద్ర లేవలేదు ఆమె.

ఆ బిడ్డే ఇరవై ఐదు సంవత్సరాల తరవాత తనకు ప్రాణభిక్ష పెట్టినందుకు చచ్చి స్వర్గానఉన్న పెద్దమ్మను తిట్టుకుంది.

పార్వతమ్మ నెత్తిని గంప మోస్తూ చీకట్లో కనిపించీ కనిపించని కాలిబాటలో వడివడిగా నడిచిపోతూంది.

రాత్రి అంతా వర్షం కురిసి వెలిసింది. ఇంకా తెల్లవారలేదు. ఆకాశం అంతా మేఘావృతమై ఉంది. చెట్లు జీమూతాల్లా చీకట్లను కప్పుకుని కదలకుండా ఉన్నాయి. కీచురాళ్లు గీపెడుతున్నాయి. దూరంలో ఎక్కడో ఒక నక్క ఉండి ఉండి కూస్తూంది. ఎక్కడా మనుషుల అలికిడి లేదు.

పార్వతమ్మ చింతచెట్టు కిందికి వచ్చేసరికి చెట్టుపై నుంచి హఠాత్తుగా జలజలా నీటి చుక్కలు రాలాయి. అదే సమయానికి దగ్గర్లో ఏదో చెట్టుమీద నుంచి గుడ్లగూబ హృదయవిదారకంగా అరచింది. పార్వతమ్మ గుండె ఝల్లుమంది. శరీరం కంపించింది. భయంతో కష్టంగారుగా నాలుగడుగులు వేసేసరికి తోవలో ఉన్న రాయి ఎదురు దెబ్బ తగిలి, ఆమె ముందుకు పడిపోయింది.

పడిన చోటునుంచి కొద్దిక్షణాలసేపు కదలలేక నిశ్చేష్టంగా ఉండిపోయింది ఆమె. గంపలో కూరగాయలన్నీ బురదపాలైనాయి. గట్టిగా దెబ్బలు తగలలేదు. పార్వతమ్మ మెల్లిగా లేచి చిందర వందరగా పడిపోయిన కూరగాయల్ని చీకట్లో చేతితో తడుముతూ దొరికినవి ఏరి గంపలో వేసుకుంది. శేరు రాయి దొరకలేదు. చిల్లర డబ్బుల సంచీ ఖాళీది దొరికింది. కూరగాయల నిండా చేతులనిండా బురద.

భీతి భీతిగా ఉంది. ఒంటిలో తమకం పుడుతూంది. గంప మళ్లీ నెత్తి కెత్తుకుని బురద చేతులతోటే గట్టిగా పట్టుకుని, పార్వతమ్మ కంగారుగా అడుగులు వేసుకుంటూ ముందుకు సాగిపోయింది

పల్లెలో అడుగు మోపేసరికి పార్వతమ్మ మనస్సు కొంచెం కుదుటపడింది. "వస్తివా, తల్లీ! నీ కోసమే చూస్తుంటిని. తెల్లవారిపోతున్నది. అయ్యయ్యో! ఆ బురదేమి చేతులనిండా?" అని ఆశ్చర్యంగా చూసింది గంగమ్మ.

పార్వతమ్మ మెల్లిగా గంప దించింది. "తోవలో బురదలో పడిపోతినవ్వా. చెంబుతో నీళ్లు తీసుకురా, అవ్వా."

"ఏమి, తల్లీ! ఎండనక, వాననక రాత్రీ పగలూ కాయ కష్టంచేసి ఎవరికి పెట్టేదమ్మా?"

"అవ్వా! నా బతుకు నీకు తెలియదా? ఈ రోజున నే నెవరికి పెట్టేదేమి; రేపు నేను కాయిలా పడితే ఉంటావా లేదా అని చూసే దిక్కూ నాకు లేదు. నీవైనా, నేనింత కష్టపడి బతుకుతుంటే మర్యాదగా 'ఏమమ్మా' అని పలకరిస్తావు. 'లేదు' అని నీ ఇంటికి వస్తే రోజూ ఇంత సంగటి ముద్దైనా పెడతావా?"

గంగమ్మ సమాధానం చెప్పకుండా నీళ్లు తెచ్చింది. చేతులు కడుక్కుంటూన్న పార్వతమ్మను, నడ్డిని చేతులు పెట్టుకుని నిలబడి పరికిస్తూ అంది గంగమ్మ: "ఈ బాధలు పడుతూ గాలికి బతక్కపోతే, ఏ అయ్య పంచనో చేరుకుంటే నీ పొట్ట గడవకపోయేనా, పార్వతమ్మా! నీ అందం నీకు ఉండనే ఉండె."

పార్వతమ్మ కళ్లలో నీళ్లు నిలిచాయి. "అవ్వా! నీవు వయస్సులో చాలా పెద్ద దానివి. ఇట్లా మాట్లాడ ఎం ధర్మమేనా, నీకు?" అని మాత్రం అనగలిగింది.

"వీళ్లా మనుషులంటే! ఇవ్వీ, వీళ్లకు తెలిసిన మానవత్వపు విలువలు!"

## ఎల్. కె. రత్నమాల

పార్వతమ్మ నాలుగు పల్లెలు తిరిగి ఇంటి ముఖం పట్టింది. మేఘాలు విడిపోయి ఎండ కాస్తున్నది. దూరాన ఎవరో పశువులకాపరి గొంతెత్తి ఏవో నాటకం పద్యాలు పాడుతున్నాడు. గంపలో అమ్మిన కూరగాయల బరువు తగ్గితే, వచ్చిన గింజల బరువు సర్దుకుంది. గంప బరువుకు అణచబడ్డ తలవెండ్రుకల కింద తల సుడుతూంది. ఎండకు చెమటపట్టి ఒళ్లంతా చీదరగా ఉంది. పొద్దుటి భయం తగ్గలేదు. కంపించే నరాలతో అడుగులు తడబడుతున్నాయి.

పార్వతమ్మ కళ్లలో అశ్రువులు నిండుతూ ఆరిపోతూ ఉన్నాయి. ఆమె నడుస్తూనే ఉంది, హృదయం భారము, జీవితం బరువు మొయ్యలేక తడబడుతూ.

తోవలో మళ్లీ ఎదురైన చింతచెట్టు ఏమీ ఎరగనట్టు అమాయకంగా నిలబడి ఉంది. సగం బురదలో కలిసిన పచ్చిమిరపకాయలు ఆమెవైపు జాలిగా చూస్తున్నాయి. బురదలో శేరు రాయీ, కొన్ని చిల్లర డబ్బులూ దొరికాయి.

బురద మట్టికైనా కనికరం లేకపోలేదు — ఈ మనుషుల మనసుల్లో నిండుకున్న బురదకే కరుణ అనేది లేనిది. ఈ మనుషుల్లో ఎంత కుళ్లు హృదయాలు ఉన్నాయి! తాము సుఖంగా ఉన్నా లేకపోయినా ఇతరులు బతుకుతే ఓర్వలేరు.

ఒక దిక్కులేని ఆడది ఒకరి చేతికిందికి పోకుండా, ఒకరి సహాయం అర్థించకుండా స్వతంత్రంగా జీవించడం ఎందుకని కిట్టదు వీళ్లకు? ఎంతమందికని ఎన్ని విధాలుగా అడుగడుగునా బుద్ధి చెబుతూ ఎంతకాలం బతికేది ఈ పాడు ప్రపంచంలో? బాధగా విరక్తిగా తన గత జీవితం నెమరువేసుకుని తర్కించుకుంటూ మెల్లిగా నడుస్తూంది పార్వతమ్మ.

పెద్దమ్మ తనను ఎంత కన్నతల్లిలా ప్రేమించినా, ఆమె ముక్కోపితనంతో తన బతుకు దినదినగండం నూరేళ్లాయుష్షు అన్నట్లుగానే ఉండేది. ఆమెను చూస్తే తలలో ఆమె విసిరిన అట్లకాడ గాయం గుర్తుకు వచ్చి వణుకు పుట్టేది. ఆ భయం బతుకు పది సంవత్సరాలు. తరవాత పెద్దమ్మ తనను ఒక అయ్య చేతిలోపెట్టి బాధ్యత తీర్చుకుంది. అయ్యకు ముప్పై ఏళ్ల వయస్సు. మంచివాడే. గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నాడు. పెళ్లి అయ్యాక, "నా భార్య నా తోటే ఉంటుంది" అని తనను కూడా తీసుకుపోయాడు. అప్పుడు తెలిసింది, ఆ అయ్యకు అప్పటికే ఒక వెంకటమ్మ ఉన్నదని.

పెద్దమ్మ తరవాత వెంకటమ్మ చేతికింది నీచపు బతుకు.

వెంకటమ్మ తనను చూస్తూ చిరచిరలాడిపోయేది. ఆమె ఎప్పుడూ తనను ఇంట్లో ఉండనిచ్చేది కాదు. పేడ పోగుచెయ్యడం, ఒంటరిగా అడివికిపోయి కట్టెలు తేవడం తన పని, రెండు చేతులా సంపాదించే భర్త ఉండగా, కొరగాని బతుకు. సగమే కడుపు నిండే తిండి! ఎండలో, వానలో దిక్కులేని పిల్లలా తిప్పట.

అసలు ఎప్పుడో వెంకటమ్మ చేతిలోనే తన జీవితం ముగియవలసింది, ఆమెకు ఎదురు చెప్పినందుకు, ఆమె విసిరిన కత్తిపీట దెబ్బతో. ఊళ్లో వాళ్లందరికీ తెలుసు, నరసింహయ్య భార్య చిన్నపిల్ల, రాకాసి

# గాలివాన



వెంకటమ్మ నీడకింద ఒతకలేదని కాని, ఎవరేం చెయ్య గలరు? ఆ భగవంతుడు రాశాడు కాబోలు.

కొన్నాళ్ళు ఊరి చివర డేరాలు వేసుకుని ఉన్న స్త్రీ-సైనికుల్ని చూడటానికి వెళ్ళేది. వాళ్ళు పిలిచి ఇంగ్లీషులో ఏదో చెప్పి బిస్కట్లూ, వెన్నా, జామ్ పెట్టే వాళ్ళు. అప్పుడప్పుడు రావుప్ప లయ్యవారు కనికరంతో ఇంటికి పిలుచుకుపోయి కథలు చెప్పి ఏమైనా పెట్టే వాడు రోజూ కూర్చోపెట్టి తన కూతురు [illegible] పుస్తకాలతో తనకు చదువు చెప్పేవాడు

తిండి పెట్టకపోయినా తను ఎదుగుతూంటే వెంకటమ్మకు ఎంత కడుపుమంట! తన భర్త రోజూ సాయంత్రం తెచ్చే పువ్వులూ, కారాలపొట్లం తనకు కనిపించేవి కూడా కాదు. అందుకని జాలితలిచి తనకు రహస్యంగా తన భర్త వేరే పొట్లాలు తెచ్చినందుకు ఉగ్రురాలై పోయింది ఆమె, తన భర్తమీద. "దాని మొహానికి ఇప్పుడే ఇంతగా మోజుపడుతుంటివి. ఇంక ఎదిగితే దాని కాళ్ళముందే పడి ఉంటావేమో!" అంది. అదీ వెంకటమ్మకు తను శత్రువైన కారణం! ఏమైనా తన భర్త వెంకటమ్మ గయ్యాళితనానికి తల వంచాడు.

ఆ పాడుబతుకు కొన్ని సంవత్సరాలయాక కాలం మారింది. మబ్బు విడిపోయి వెలుగు వచ్చింది. తను పెద్దదయింది. తన భర్త తనను ప్రేమతో చూడటం సహించలేక భర్తతో తగవుపడి పుట్టింటికి వెళ్ళి పోయింది వెంకటమ్మ

వెంకటమ్మ నీడ వదిలి తను స్వేచ్ఛగా బతికిన నాలుగేళ్ళూ ఒక స్వర్గంలోలా బతికింది. అవేగా తనకు మిగిలిన మధుర స్వప్నాలు!

భర్త ప్రేమగా చూసేవాడు [illegible] లందరికీ తనపై గౌరవంగా ప్రేమగా ఉండేది. పార్వతమ్మలో ఏ కల్మషం లేదనీ ఆమెది దేవతాహస్తమనీ అనేవారు అంతా.

ఎవరికైనా జ్వరంగా ఉంటే పార్వతమ్మ చేతితో పెట్టిన ముద్ద తింటే జ్వరం తగ్గుతుందట. చిత్రం! నిజంగానే తగ్గేది. ఊళ్ళో ఎవరైనా స్త్రీ ప్రసవిస్తే పుట్టిన బిడ్డకు పార్వతమ్మ మొదటి స్నానం చేయిస్తే బిడ్డ సుఖంగా ఉంటుందట. తనకు బిడ్డలు లేరు. పురిటి బిడ్డకు స్నానం చేయించమంటే సిగ్గుపడేది ఊళ్ళోనుంచి పర్షకు ఎద్దులు కొనుక్కోడానికి పోయే వాళ్ళు. పార్వతమ్మ చేతి తాంబూలం తీసుకుని [illegible]ద్దరేవాళ్ళు రైతులు కొత్త నాగలి చేయిస్తే దానికి తను పసుపు రాసి కుంకుమ పెట్టేది. ఆ రోజుల్లో [illegible] ఊరి చివర [illegible]



MTP-1-P-1-65/66 TL

# గాలి వాన

తల్లికి చిన్న దేవళం కట్టించింది. ఆ తల్లి కిప్పుడు ప్రతిదినం పూజ చేస్తూనే ఉంది. వారం వారం కొబ్బరి కాయ కొడుతూంది.

ఒక రోజున తన భర్త వాడిపోయిన ముఖం వంచుకుని ఇంటికి వచ్చి లోపల గోడకుకూలబడ్డాడు. ఎప్పుడూ ఉండే నవ్వుముఖం లేదు. తను తెచ్చిన నీళ్లతో కాళ్లు కడుక్కోలేదు.

తను భయం భయంగా దగ్గిరికి వెళ్లింది. తన ముఖంలోకి చూసేసరికి ఆయనకు కళ్లలో నీళ్లు తిరిగాయి. తన చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు. "నన్ను ఉద్యోగంనుంచి సస్పెండు చేశారు" అన్నాడు, ఒక్క ఏడవడమే తరవాయిగా.

"ఎందుకు?" అంది తను గుండెలు వేగంగా కొట్టుకుంటూంటే.

"ఎవరి దగ్గిరో లంచం తీసుకుని నా డ్యూటీ తప్పు చేశానని."

"నిజమేనా?"

"డ్యూటీలో తప్పు చేసినమాట వాస్తవమే. అది పొరపాటున జరిగింది. అంతే. లంచం తీసుకోలేదు."

"నా ముఖంలోకి సూటిగా చూసి చెప్పు. ఈశ్వరుడు సాక్షిగా లంచం తీసుకొని ఉండలేదా?"

"నీ సాక్షిగా తీసుకొని ఉండలేదు" అని తన తలపై చెయ్యిపెట్టి ప్రమాణం చేశాడు.

"అయితే ఫరవాలేదు. లే. కాళ్లు కడుక్కుని భోజనం చేస్తువుగాని." అప్పటిధైర్యం ఏమో ఇప్పుడు తలుచుకుంటే తనకే అర్థం కాదు.

ఆయన భోజనం ముగించాడు.

"జేబులో ఏమైనా పాపపు సొమ్ముంటే టేబిలు మీద పడెయ్యి" అంది తను. ఆయన జేబులోని డబ్బులన్నీ తీసి బల్లమీద పెట్టాడు.

"బట్టలు మార్చుకుని ఈ బట్టలు కట్టుకో... ఈ ఇరవై రూపాయలూ తీసుకొని, అనంతపురం పోయి మీ ఆఫీసర్ని ఇంటి దగ్గిర కలుసుకుని పొరపాటైందనీ, సత్యంగానే లంచం తీసుకోలేదనీ జరిగిందంతా వివరంగా చెప్పు. పోయేటప్పుడు రెండు ఏపిల్ పళ్లు తీసుకొనిపో. లోపల దుర్గమ్మ తల్లికి నమస్కారం చేసుకునిపో."

ఆయన ఒక యంత్రంలా కదిలాడు. మరునాడు తిరిగి వచ్చి డ్యూటీలో చేరాడు.

ఇవ్వన్నీ ఎట్లా జరిగాయి? ఆనాటి తన జీవితానికీ నేటి జీవితానికీ ఎంత భేదం! ఆ కాలం అంతా ఒక రాత్రి కన్న తియ్యని కల! ఇప్పుడు తన జీవితంలో ఏమి మిగిలింది? ఇప్పుడు తను ఎదుర్కొనేది గాలివాన!

కాలం ఆగకుండా నడిచిపోతుంది. జరిగినవి మళ్లీ జరగవు. నీటిలో చేపలు బయటపడతాయి. వలలో చిక్కిన చేపలు తప్పించుకుని నీటిలోనూ పడవచ్చు. మళ్లీ వచ్చింది, వెంకటమ్మ, ఈసారి రాక్షసి రూపంతో. మళ్లీ తనబతుకు తనదే.

ఛీ! ఈ పాడుకొంప ఒకటి! దానికి అనుగుణంగానే ఇరుగమ్మా, పొరుగమ్మాను. ఈ కొంప కూలిపోవాలి. పార్వతమ్మ చెట్టూ చేమా పట్టిపోవాలి.

అప్పుడూ వీళ్లందరికి మనస్పర్తి. ఎందుకో ఈ ఆధారంలేని ఈర్ష్యలు హఠాత్తుగా చూస్తే పక్కింటి మహాతల్లికి తనపై ఉన్న దయ కనిపించింది. ఆమె వర్షం నీళ్ల అట్లకాడతో గొయ్యి తీస్తూ ఇంటి పునాదిలోకి మలుపుతూంది. ఆమె భర్తే పని కట్టుకుని, దారి ఖర్చులు పెట్టుకుని, తన భర్త దగ్గిరికి పోయి, తనమీద కథలల్లి చెప్పి వచ్చాడు. తను వాళ్లపట్ల ఎంతో ఆదరణ చూపుతూంటే, ఇదీ వాళ్లిచ్చే ప్రతిఫలం! ఓర్వలేరు. వీళ్లంతా ఎల్లకాలం బతికి పట్టం కట్టుకునేది లేదు. కాదా అంటే ఒకరు ముందూ మరొకరు వెనకాను. వీళ్లంతా ఇల్లా జీవించి ఏమి సాధిస్తారు? ఏమీ సాధించరు. మురిగిన మెదళ్లతో కొంతకాలం బతికి వాళ్లకు తెలియకుండానే కళ్లు మూస్తారు. వాళ్లను భగవంతుడేమి చేస్తాడో!

పార్వతమ్మ కళ్లనిండా నీళ్లు నిలిచాయి. ఆమె నడక బాధతో ఇంకా కుంటుపడింది.

ఈ వానలో వంటిల్లు అంతా నీళ్లమయం. ఎల్లా అన్నం వండుకు చచ్చేది? పక్కింటి పెద్ద మనిషే తన గోడ దెబ్బ తినగూడదని ఈ దిక్కులేని ఆడదాని వారపాక మార్పించాడు, మళ్లీ తనే గోడ కట్టిస్తానని. నాలుగేళ్లయినా ఇంత వరకూ మాట్లాడడు. గోలపెడితే ఇదుగో అదుగో అంటాడు. నలుగురు పెద్ద మనుషులు చెప్పినా ఏం చేశారు? ఈ పాడు పల్లెకు పెద్దమనుషులు కూడాను! ఇంతకంటె నక్కలు మేలు. అవి చచ్చిన శవాల్ని మాత్రమే పీక్కుతింటాయి.

ఈ ఇంట్లో చేరిన రెండు నాగుబాముల్ని ఆ అమృత హృదయులంతా అవి విషజంతువులు కాబట్టి చంపుతారట. ఈ మనుషుల కంటే విషజంతువులా అవి? తల్లీ పిల్లా పడగలు విప్పినప్పుడు చూస్తే ముచ్చటేస్తుంది! పోనీ, వాళ్ల మాటమీద అవి తనను కరిస్తే అంతకంటె కావలసిందేముంది!

ఇప్పుడు ఏ బాబమ్మకో చెప్పి బతిమాలి వండించుకోవాలి. తురక కూడు తింటున్నావని ఏడుస్తా రంతా. తోటి హిందువులై ఉండి వీళ్లంతా చేసే దేమిటి? తన బతుకే తనను బతకనియ్యరే! బీగం చెప్పినట్టు సాయిబుల మతం తీసుకుంటేనే మేలని పిస్తూంది. తోటి సాయిబులన్నా ప్రేమగా చూస్తారు. అప్పుడే తనను బీగం ఫాతిమా అని పిలవడం మొదలుపెట్టింది. ఈ ఊహలకు తప్పుపట్టే పెద్దలే రేపు తను చస్తే వెట్టివాళ్లచేత ఈడిపించి పారేస్తారు.

"అయ్యో రామా! బీగంచెవి ఏదీ?" అని కంగారుగా తడుముకుంది పార్వతమ్మ, ఇంటిముందు నిలబడి. చిల్లర డబ్బుల సంచీ తీసి వెతికింది. అది ఎప్పుడో బురదలో ఖాళీ అయిపోయింది. రెండో బీగం చెవి ఇంట్లో గూట్లో ఉంది. తలుపులు ఎత్తి లోపలికి పోవాలి.

పార్వతమ్మ సహాయంకోసం దిక్కులు చూసింది. రాత్రి వర్షం కురిసింది. మళ్లీ చినుకులు మొదలు పెట్టాయి. తోవను ఎవరూ పోవడంలేదు. సందు గోడ దగ్గిరికి పోయి గోడ అవతల వీరప్పను పిలవాలని చిన్న పాతగోడమీదికి కాలు పెట్టింది.

"వీర..." హఠాత్తుగా వానకు నానిపోయిన గోడ పెళ్లలు విరిగి పడిపోయింది. పార్వతమ్మ కెవ్వున కేకవేసి కింద బురదలో పడిపోయింది.

మళ్లీ తెలివి వచ్చేసరికి తన ఇంట్లో ఉంది పార్వతమ్మ. బట్టలన్నీ బురదకొట్టుకుపోయాయి. లేవబోయిన పార్వతమ్మ, మోకాలు కలుక్కుమనే సరికి, "అమ్మో!" అని బాధతో విలవిల్లాడిపోయింది.

మూడు రోజులు పక్కమీదే గడిచాయి. ఆ సమయంలో సుబ్బమ్మ సాయం చాలా సాయం చేసింది. "గింజలు నగంవరకూ ఇంటికి చేరవేస్తేనే. ఆపదలో ఆదుకుంది" అని వెయ్యి నమస్కారాలు చేసింది పార్వతమ్మ.

నాలుగవ రోజున మెల్లిగా లేవగలిగింది. మోకాలు తోమిస్తున్నా నెప్పి తగ్గటంలేదు. ఎవరో చెప్పిన ఆకులు ఉడికించి కట్టింది. కోడిగుడ్డు సొన పట్టు వేసింది. పడినచోట కొబ్బరికాయ కొట్టింది. కాలు నెప్పి అట్లాగే ఉంది.

సంపాదన ఆగిపోయింది. ఖర్చు పెరుగుతూంది. పార్వతమ్మ జీవితమే కుంటుపడింది.

మరొక వారం గడిచింది. పార్వతమ్మ కష్టంమీద మెల్లిగా అడుగులు వేస్తూంది. మోకాలు నయం కాలేదు.

ఆ సాయంత్రం తలుపుతట్టిన శబ్దం అయితే తలుపు తీసింది పార్వతమ్మ. గుమ్మంలో తూలిపోతూ నరసింహయ్య! ఒక్క ఊపులో లోపలికి వచ్చిండ్డాడు. ఒంటిమీద తెలివిలేదు. "పారవతీ....." అంటూ గొణుగుతూ కాళ్లు చాపి గోడకు చేరబడ్డాడు. గోడనుంచి కిందకు ఒరిగాడు.

పార్వతమ్మ శుభ్రమైన పక్క వేసింది. పీరప్ప సహాయంతో భర్తను పక్కమీద పడుకోబెట్టింది.

నరసింహయ్యకు తెలిసి వచ్చాక అడిగింది, కన్నీళ్లతో, "ఏమి, స్వామీ, ఈ రాగుడు? నా జీవితం ఈ మాదిరిగా ఉండె పోకూడ. సుఖంలేదా?"

అతడి ముఖంలో విషాదం తాండవిస్తూంది. "లేదు. నాకూ బతుకు కష్టమైపోయింది. ఆ రాక్షసివల్ల బతకలేక, చావలేక బతుకుతున్నాను. నీ కాలికి మోపుగా దెబ్బలగిలిందని తెలిసి చూస్తామని వస్తిని."

పార్వతమ్మ ఏమీ మాట్లాడలేదు. మెల్లిగా లేచి పెళ్లి నీళ్లతోడి, భర్తను స్నానం చెయ్యమంది. స్నానం అయ్యాక, ఇత్తడి పళ్ళెంలో అతడి పాదాలు పెట్టి, నీళ్లలో కడిగి, ఆ నీళ్లు కొంచెం చేతుల్లో తీసుకుని తలపై చల్లుకుంది.


నరసింహయ్యకు కళ్లలో నీళ్లు తిరిగాయి. 'వద్దు, వద్దు. నా పాదాలు తాకవద్దు. నేను పెద్ద తప్పుచేశా. ఈ ప్రపంచంలో ఎదకపందెవాడిని నేను" అంటూ చిన్న పిల్లవాడిలా ఏడిచాడు.

"అట్లా అనకండి, స్వామీ! ఎప్పుడప్పుడైనా ఈ పాదసేవ చేసే అదృష్టం నాకు లేదా?" అని కన్నీరు కార్చింది ఆమె.

"పార్వతీ! దేవత వంటి నా భార్యకు ఎంతెంత అపరాధం చేశాను! ఏమి ఎరుకు నాది!" అని వాపోయాడు నరసింహయ్య.

నరసింహయ్య వెళ్లిపోయాంటే పార్వతమ్మ,

(తరువాయి 37 వ పేజీలో)



ఉయయొర్

చి[illegible]ం—ఎమ్. [illegible] (హైదరాబాద్)

# గాలి వాన

( 35 వ పేజీ తరువాయి)

అతడు వారించినా వినకుండా పొలిమేర వరకూ కష్టంతో సాగనంపడానికి వచ్చింది. ఇరువురి కళ్లలోనూ నిండుగా అశ్రువులు నిండి కొంత సేపటికి గాలికి ఆరిపోయాయి. పార్వతమ్మ బాధగా, భారంగా వెనుతిరిగింది. నరసింహయ్య తల వంచుకుని మెల్లిగా ముందుకు సాగిపోయాడు.

కాలికి దెబ్బ తగిలిన నెల రోజుల తరవాత కూడా బాధ అనుభవిస్తూ మెల్లిగా అడుగులు వెయ్యటం తప్ప, నెప్పి తోవకు రాలేదు. ఈ నెలదినాలూ వ్యాపారం లేదు. ఇంట్లో గింజలు లేవు. డబ్బు లేదు. మధ్యాహ్నం పూట కాలు చాపుకుని గోడకు చేరబడి ఒంటరిగా కూర్చుని ఎలవలా ఏడ్చింది, దిక్కులేని పార్వతమ్మ.

'ఏమి చేస్తును, భగవంతుడా! నన్నింత నరక యాతన పెట్టడమేల? ఒక్కసారిగా ప్రాణం తియ్య రాదా? కాలు కదపలేకుంటే ఇంక జీవితమెలా గడిచేది? ఎవరింక దిక్కు? ఇంతకాలంనుండీ పూజలు చేస్తుంటినే! మనస్సు నిష్కల్మషంగా బతుకు తుంటినే! నేను చేసిన పూజలన్నీ ఏమైనవి? దీనులమీద కనికరంలేని నీవేమి దేవుడివి? ఈ ఈ దుర్గ కెన్నిపూజలు చేస్తేనేం? ఈ బతుకు కూడా బతకనియ్యదు' అని గొల్లుమని ఏడ్చింది, బేలగా.

'ఆత్మహత్య చేసుకుంటేనేలా? ఈ దుర్మార్గపు మనుషు లేమనుకుంటారు? జరిగినన్ని దినాలూ పొగరుగా మంచి బట్టలు కట్టి బతికింది. కాలు పడిపోతే పొట్టగడవక ప్రాణం తీసుకుంది అని ఆడి పోసుకోరూ! ఛీ! ఇన్ని దినాలూ అభిమానంగా బతికి చచ్చాక మాట అనిపించుకుని తేలికపడేదా?''

తలుపు తట్టిన శబ్దమైతే కళ్లు తుడుచు కుంటూ కష్టంమీద లేచి తలుపు తెరిచింది.

''ఏమి? ఏడుస్తుంటివా, పార్వతమ్మా?'' అన్నాడు రామయ్య.

పార్వతమ్మ లేనినవ్వు తెచ్చుకుంది. ''లేదు, రామయ్యన్నా. రా. కూర్చో. కొంచెం రొంప పట్టింది. అంతే.''

రామయ్య మాట్లాడకుండా పరీక్షగా ఆమె ముఖంలోకే చూస్తున్నాడు. ఆమె నవ్వింది. ''ఏం? ఏడుస్తున్నాననుకుంటుంటివా?'' అంది.

రామయ్య కొంచెంసేపు ఆలోచించాడు. ''నువ్వు డాక్టరు దగ్గిరికి పోవడం మేలు'' అన్నాడు.

''రామయ్యన్నా! ఆ డాక్టర్లకి నేనేమి ఇచ్చుకో గలనో నీకు తెలియదా?'' అంది, ఆమె.

''గవర్నమెంటు డాక్టరమ్మ దగ్గిరికి పో. నేను కూడా చెబుతాను'' అన్నాడు.

పల్లెనుంచి పదిమైళ్ల దూరం పోవాలి ఆసు పత్రికి. ఆరోజునే కుంటుతూ వెళ్లి బండి ఎక్కింది పార్వతమ్మ.

డాక్టరమ్మ పరీక్ష చేసి అంది: ''కాలికి నీరు పట్టింది. దెబ్బతగిలి ఇన్నాళ్లైనా ఏం చేస్తున్నావు?''

''లేదమ్మా. పల్లెలో ఏవో మందులు తిని పట్టు వేసుస్తిని. ఏమీ నయం కాలేదు.''

''హూఁ! సరే. చాలా కష్టం. మంచి మందులూ ఇంజక్షన్లూ ఇవ్వాలి. ముప్పై రూపాయలవుతుంది. తీసుకుని ఇంటికి రా'' అంది డాక్టరమ్మ.

పార్వతమ్మకు ధైర్యం సడలిపోయింది. ''అమ్మా! నాకు మంచీ చెడూ చూసేవాళ్లెవరూ లేరు. నేను రోజూ గంప నెత్తిన పెట్టుకొని పల్లెపల్లే తిరిగి పొట్టపోసుకునేది. ఇప్పుడు నెలనించీ ఆ ఆధారం కూడా లేదు. చాలా కష్టంలో ఉంటిని. నీవు తల్లి వంటిదానివని ధైర్యంతో వస్తిని, తల్లీ'' అంది ఎంతో జాలిగా, వినయంగా.


డాక్టరమ్మ ముఖం చిట్లించింది. ''అయితే మందుల ఖర్చుకూడా నేనే భరించేదా?''

''కాదమ్మా. నేనేమీ ఖర్చు చెయ్యలేని స్థితిలో ఉంటిని. గవర్నమెంటు మందులున్నవి కదా? నావంటి బీదవాళ్లకి సాయంచేస్తే దేవుడు మీకు మేలు చేస్తాడు తల్లీ. నేను ఎవరిముందూ ఇంతగా ప్రాధేయపడను. తోటి స్త్రీవికదా అని అడుగుతుంటినమ్మా!''

''సరే, నీ ఇష్టం. నిన్ను మందుకి రావద్దనడం లేదు. కాని, నీకు కావలిసిన మందులు కొంటే తొందరగా తగ్గుతుంది. ఇంకా ముదిరిందంటే ప్రమాదం'' అని, పార్వతమ్మ మెడలోని గొలుసువంక చూస్తూ అక్కడినుంచి వెళ్లిపోయింది డాక్టరమ్మ.

పార్వతమ్మకు మనస్సు చాలా బాధగ ఉంది. ఈ మెడలో గొలుసు ఉండబట్టి తను గౌరవంగ బతకగలుగుతూంది. ఎవరైనా పాతిక రూపాయలు అప్పిచ్చినా, కూరగాయల అంగడిలో అరువిచ్చినా ఈ గొలుసును చూసే. అది పోతే ఇంక తన మాటకు విలువ ఇవ్వరు. డబ్బుకు మాత్రమే విలువకట్టే ఈ ప్రపంచంలో తను ఇంక ఒక్క అడుగు ముందుకు వెయ్యలేదు.

వారం రోజులు గడిచాయి. పార్వతమ్మకు పది హేను రూపాయల అప్పూ, మందచ్చేవాడి నీచపు ప్రవర్తనకు అతడిపై అసహ్యమూ పెరిగాయికాని, నెప్పి తగ్గలేదు. ఈ వారం రోజులూ ఎవరో తెలిసిన వాళ్ల ఇంటి దగ్గిర ఉంటూ, అక్కడినుంచి ఆస్పత్రికి రోజూ నడవడంవల్ల కాబోలు, కాలు బాధగా ఉన్నా, నడక కొంచెం అలవాటుపడింది. మందిచ్చేవాడిని గురించి ఏం చెయ్యాలో ఆమెకు అర్థం కాలేదు. మనస్సు వికలంగా ఉన్నది. ఆమెకు ఒక్క తోదారి కనిపించింది. అది తన ఇంటికి దారి.



గంగమ్మ తల్లి చీర కొంగుల్లో — ఫోటో—సి. ఎస్. ఉపాధ్యాయ (బొంబాయి-26)

రామయ్య చిరాకు పడ్డాడు. మళ్లీ తీసుకువచ్చి సూర్యం డాక్టరుతో మాట్లాడి పదిహేను రూపా యలకు నయం చేసేటట్లు ఒప్పించి వెళ్లాడు. పార్వతమ్మ అప్పు తీసుకుని సూర్యం డాక్టరుకు అయిదు రూపాయలు అడ్వాన్సుగా ఇచ్చింది.

సూర్యం డాక్టరు తమాషాగా మాట్లాడటం మొదలుపెట్టాడు. పార్వతమ్మ జబ్బ పట్టుకుని, ''ఈ మంచంమీద పడుకో. వచ్చి పరీక్ష చేస్తాను'' అన్నాడు.

మూడుగంటలవరకూ తిరిగి అక్కడికి రాలేదు అతడు. పార్వతమ్మకు భోజనం లేదు.

సూర్యం డాక్టరు పార్వతమ్మ కాలు అంతా సున్నితంగా పట్టుకుని, చాలాసేపు ...

నవ్వుతూ. "ఏదీ! కళ్లల్లో నెత్తురుందా?" అని ఆమె కనురెప్పలు వేళ్లతో తెరిచి చూశాడు. "రక్తం బాగానే ఉంది" అని, చేతి వేళ్లు తీసివేస్తూ ఆమె బుగ్గ పుణికాడు. పార్వతమ్మకు ఎక్కడలేని కోపం వచ్చింది. "ఏమది?" అని కళ్లెర్రజేసింది. కళ్లతో అసహ్యం కురిపించింది. సూర్యం డాక్టరు నవ్వు మొహంతోనే ఉన్నాడు.

"లేచి నడు. నొప్పి ఎక్కడుందో చూడాలి" అన్నాడు. ఆమె ముఖం చిట్లించుకుని లేవబోయింది. అతడు నవ్వుతూ ఆమె భుజాలు పట్టుకుని లేవదీశాడు.

పార్వతమ్మకు ఒళ్లు తెలియలేదు. అతడిని విదిలించి పారేసింది. "ఇదేనా నీ ఉద్యోగం? డాక్టరువి అంటే కష్టంలో ఉన్నవాళ్లకు తండ్రివంటివాడివి. సిగ్గు కూడా లేకుండా ఆడవాళ్లని తేలికపరుస్తావా? నీచుడా! ఇదే నీ భార్య నెవరైనా అవమానపరిస్తే?" అని, కాలి బాధతోనే విసురుగా నడిచిపోయింది.

నరసింహయ్య పార్వతమ్మ వద్దనుంచి తిరిగి వచ్చాక అతడి మనస్సులో కల్లోలం అధికమైపోయింది. చాలా రోజులు ఆలోచించాడు. చివరికి ఒకరాత్రి అతడికి ఒకే ఒక్క మార్గం ఉన్నట్టు కనిపించింది.

ఉదయమే లేచి, కూనిరాగాలు తీస్తూ నీళ్ల బిందె తెస్తున్న వెంకటమ్మను పిలిచాడు. "నీవు ఈ ఇల్లు వదిలి పోవాలి. మీవాళ్ల దగ్గిరికి పోయి బతుకు" అన్నాడు.

వెంకటమ్మ విస్తుపోయింది. వెంటనే నీళ్ల బిందె దించి నరసింహయ్య దగ్గిరగా వచ్చింది. "ఏమంటివి? నీకు తిక్కగాని పుట్టలేదు కదా!" అన్నదామె.

"లేదు. నేను గట్టిగా నిశ్చయించుకుంటిని. నీవింక నాతో ఉండేది లేదు. నెలకి ఇరవై రూపాయలు పంపుతూంటాను. నీ ఇష్టం వచ్చినట్టు పోయి బతుక్కో" అన్నాడు.

"నేను పోను" అంది వెంకటమ్మ ఖండితంగా.

"పోకపోతే ఖూనీ చేసేస్తాను."

"నిన్ను నేను ఖూనీ చెయ్యలేననుకుంటివా?"

"చెయ్యలేవనుకోలేదు. కాని, అప్పుడు నీకీ ఇరవై రూపాయలూ కూడా వచ్చేది లేదు. మర్యాదగా పోతే మంచిది. లేకపోతే పంచాయితీ చేయిస్తాను."

"ఆ పంచాయతీ చెప్పే మొగాడెవడో చూస్తాము" అంది వెంకటమ్మ ఘాటుగా.

నరసింహయ్య పెద్ద మనుషుల మధ్య పంచాయతీ చేయించాడు. అతడి కారణాలు అతడు చెప్పాడు. వెంకటమ్మ గోలుగోలుమని ఏడుస్తూ, తిట్టుకుంటూ బస్సు ఎక్కింది.

నరసింహయ్య ఉదయం లేచి కాలకృత్యాలు తీర్చుకున్నాడు. వానజల్లు పడుతూంది. గాలి తీవ్రంగా వీస్తూంది. అయినా, పార్వతమ్మను తీసుకురావడానికి ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యడానికి అతడికి ఇష్టంగా లేదు. వెంటనే పోవాలని అతడి మనస్సు ఆరాటపడుతూంది.

అతడు బట్టలు వేసుకుని, గొడుగు చేత్తో పుచ్చుకుని ఇంటికి తాళంవేసి, గొడుగుతెరిచి రోడ్డు మీదికి నడిచాడు. గాలి అతడిని గొడుగుతోసహా వెనక్కి నెట్టి వేస్తూంది. ఎదురుగా పోస్టు బంట్రోతు వచ్చి అతడికొక కవరు అందియ్యటంతో నరసింహయ్య తిరిగి ఇంటి వరండాలోకి వచ్చి కవరు తెరిచాడు.

"ప్రియాతిప్రియమైన, దైవ సమానులైన భర్తగారికి మీ భార్య పార్వతమ్మ సాష్టాంగ నమస్కారములు చేసి వ్రాసుకొనేది.

స్వామీ! నా అనేవారు లేక ఒక ఆడది జీవించడం ఎవరూ సహించలేరు. నా జీవితం దురదృష్టవంతుడు వైకుంఠపాళి ఆడినట్లున్నది. ఒకప్పుడు నా అందమే నన్ను పామై కరుస్తున్నది. దిక్కులేని వారంటే ఆ శ్రీహరికే తేలికైపోతుంది.

నా హృదయాన్ని నేను విప్పి చెప్పలేను, ప్రభూ! నా నొసటినుంచి రాలే స్వేదబిందువులు, నా శరీరంలో ప్రవహించే రక్తపు చుక్కలూ, ఈ జాబుపై రాలే నా కన్నీటి బొట్లూ మాత్రమే మీకు నా పరిస్థితిని తెలియజెయ్యగలవు.

ఇతరుల సంగతిదాకా ఏల? స్వామీ, నేను మీ భార్యనే, నా అన్ని ఆశలూ మీ పైనే పెట్టుకుంటినే, మీకోసం, మీ పాదాలవద్ద పడిఉండటంకోసం ఘోరమైన తుపానుకు ఎదురు నిలిచి జీవిస్తుంటినే, నా సర్వస్వమూ మీ కొరకేననీ, ఎన్నటికైనా మీకు నా మీద కరుణ రాకపోతుందా అనీ మీ పాదసేవపై ఆశతో, ఈ ప్రపంచంలో నరకయాతనతో బతుకుతూ కూడా, ఒక్కనాడూ మిమ్మ ఏదీ కోరకుండా, మీ మనస్సు కష్టపెట్టకుండా బతుకుతుంటినే! స్వామీ! అటువంటి మీ బానిసమీద మీకే కనికరం లేనిది ఇతరుల గూర్చి ఏమి చెప్పేది! అది నా నొసటి వ్రాత. అది నేనే అనుభవించాలి. వెంకటమ్మ కూడా నావంటిదే. ఆమెకు అన్యాయం చెయ్యటం కూడా నాకిష్టంలేదు. ఇవ్వన్నీ జరిగిపోయిన విషయాలు.

నాకెక్కడా జీవించడానికి తావు కనిపించడం లేదు. అందుకని నేను పోతున్నాను. ఎక్కడికి పోతానో, ఏమైపోతానో నాకే తెలియదు.

ఇంటి బీగంచెవి రామయ్య ఇంట్లో ఇచ్చి ఈ రాత్రే పోతున్నాను. నన్ను గురించి రెండు కన్నీటి చుక్కలు రాల్చే జీవి ఈ ప్రపంచంలో మీరొక్కరే నాకు సెలవియ్యండి.

కన్నీటితో మీ పాదదాసి,
పార్వతి." ★



సందెవేళ వానదేవుడు — ఫోటో—రామదాసు (మద్రాసు-18)